సాక్షి ఖమ్మం

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



మోసం రూ.5కోట్లకు పైగానే..

ఖమ్మంలోని ఓ బ్యాంకు మేనేజర్ ఖాతాదారుల నగదును మళ్లించుకున్న ఘటనలో అధికారులు విచారణ చేపడుతున్నారు. 8లో



మాయమై పోతున్నడమ్మా..

జిల్లాలో ఒకేరోజు మూడు హత్యలు జరిగాయి. రెండు చోట్ల భార్యలను భర్తలు హత్య చేయగా.. ఇంకో ఘటనలో భార్యే హత్యకు పాల్పడింది. 8లో

గరిష్టం / కనిష్టం 38° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఉష్ణోగ్రత కాస్త తక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నానికి మాత్రం ఎండ పెరిగి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



యాగశాలలో కలశ స్థాపన పూజ చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీవారికి సుప్రభాత సేవ నిర్వహించాక, యాగశాలలో మండపారాధన, కలశ స్థాపన పూజలు చేశారు. ఆతర్వాత స్వామి వారి పాదానికి పంచామృతాలతో అభిషేకాలు చేయగా.. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే, సాయంత్రం స్వామి వారు ఉభయదేవేరులతో కలిసి అశ్వవాహనంపై భక్తుల జయ జయ ధ్వానాల నడుమ గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

15నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈనెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ-2) పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ, డీసీఈబీ సెక్రటరీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జిల్లాలోని 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను యాజమాన్యాలు, హెచ్‌ఎంలు ఎంఆర్‌సీల నుంచి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, 1నుంచి 7వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9నుంచి 11-30గంటల వరకు, 8తరగతి వారికి ఉదయం 9 నుంచి 11-45గంటల వరకు, 9వ తరగతి వారికి ఉదయం 9 నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

మొక్కలు ఎండిపోవద్దు..



నర్సరీలో పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిటౌన్: ఎండతీవ్రత కారణంగా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సూచించారు. సత్తుపల్లి మండలంలోని చెరుకుపల్లి నర్సరీతో పాటు రామచంద్రాపురంలో అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన నీటి కుంటలను బుధవారం ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణపై సూచనలు చేయడంతో పాటు అటవీ జంతులు ఇబ్బంది పడకుండా నీరు సమకూర్చాలని ఉద్యోగులకు సూచించారు. ఎఫ్‌డీఓ మంజుల, రేంజర్ స్నేహలత, ఎఫ్‌ఎస్‌ఓ మదన్‌తో పాటు బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన మైనింగ్ ఏడీ



చాకిరేవు కుంటను పరిశీలిస్తున్న ఏడీ, ఉద్యోగులు

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో ఇటీవల ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతుండగా.. ఇందుకు గ్రామ చెరువు నుంచి మట్టి తోలకాల అంశం కూడా కారణమని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యాన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్ బుధవారం ముచ్చర్ల క్రాస్ సమీపంలోని చాకిరేవుకుంటను పరిశీలించారు. చెరువు నుంచి మట్టి తోలకానికి ఎంత మంది రైతులకు అనుమతి ఇచ్చారు. ఇప్పటివరకు ఎంత మట్టి తరలించారనే అంశాలపై ఇరిగేషన్ ఏఈ వినోద్‌తో చర్చించారు. ఈమేరకు పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే, చెరువులు, కుంటల నుంచి అనుమతి లేకుండా మట్టి తోలకాలు జరగకుండా చూడాలని, నిబంధనల అతిక్రమించిన వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని తెలిపారు. మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తహసీల్దార్ సుధాకర్, ఆర్‌ఐ నక్రు పాల్గొన్నారు.

తర్జన.. భర్జన

ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తర్జనభర్జన పడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్రమంతా ఇక్కడి అభ్యర్థి అంశం చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ కుటుంబీకులకే టికెట్ ఇవ్వాలని పట్టుపడుతుండగా.. ఇంకోపక్క రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తుండడంతో టికెట్ ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. మరోవైపు నోటిఫికేషన్ సమయం సమీపిస్తుండడంతో అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్ పార్టీలో కాక పుట్టిస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



కొలిక్కి రాని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక

- తెరపైకి రోజుకో కొత్త పేరు
- కుటుంబీకులకు టికెట్ కోసం మంత్రుల పట్టు
- నోటిఫికేషన్ సమీపిస్తుండడంతో కేడర్‌లో ఉత్కంఠ

టికెట్ కోసం విశ్వప్రయత్నాలు

ఖమ్మం లోక్‌సభ టికెట్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ నేతలు జెట్టి కుసుమకుమార్, లోకేష్ యాదవ్, నాగ సీతారాములు, మానుకొండ రాధాకిషోర్, పోట్ల నాగేశ్వరరావు ఆశిస్తున్నారు. ఎవరికి వారు హైదరాబాద్‌లో సీఎంను కలవడంతోపాటు హస్తినలోనూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలను కలిసి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆశావహులు ఎక్కువ మంది ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ భేటీలో మాత్రం ముగ్గురు, నలుగురి పేర్లే పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇందులో మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డిల్లో ఎవరికో ఒకరికి టికెట్ దక్కుతుందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఇంతలోనే మంత్రి పొంగులేటి వియ్యంకుడు రఘురామిరెడ్డి, నిజామాబాద్‌కు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, జిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు పేర్లు కూడా పరిశీలించినట్లు ప్రచారం మొదలైంది. భట్టి, పొంగులేటితో పాటు మిగిలిన ఆశావహులు కూడా టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తుండడంతో అధిష్టానం ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో తేలాల్సి ఉంది.

ఎవరైతే ఎలా..

మంత్రులు తమ కుటుంబీకులకే టికెట్ కావాలని పట్టుపడుతుండడం.. ఇంకోవైపు ఇతరులు కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండడంతో ఎవరిని బరిలోకి దింపితే అటు నేతలు, ఇటు కేడర్‌ను సమన్వయం చేస్తారు.. పార్టీ పరంగా ఎవరైతే బాగుంటుందనే కోణంలో కాంగ్రెస్ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదేసమయాన సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజికవర్గానికి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా పెద్దపీట వేశాం, మిగిలిన సామాజికవర్గాలకు ఎలాగైతే న్యాయం జరుగుతుందని అధిష్టానం ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. చివరకు అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా.. టికెట్ ఆశించిన మిగిలిన నేతలను బుజ్జగించడం కూడా పార్టీ అధిష్టానం ప్రాధాన్యతగా తీసుకుంటుందనే చర్చ జరుగుతోంది.

తుది దశకు కసరత్తు

ఈనెల 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఆరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అయితే, నోటిఫికేషన్ తేదీ సమీపిస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై కేంద్ర ఎన్నికల కమిటీ చేస్తున్న కసరత్తు తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తారని సమాచారం. ఇప్పటికే బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా నియోజకవర్గ పరిధిలో వారు ప్రచారం చేస్తున్నారు. కానీ అభ్యర్థి ఎంపిక విషయంలో జరిగిన ఆలస్యంతో ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ వెనుకబడింది. ఈమేరకు అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచే ముమ్మరంగా ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

ఏకాభిప్రాయం కుదరక...

రాష్ట్రంలో ఇప్పటివరకు 14 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా.. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలు మిగిలాయి. ఇందులో ఖమ్మం స్థానంపై హైదరాబాద్‌లోనే కాక హస్తినలోనూ పలుమార్లు ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ చర్చించినా ఓ కొలిక్కి రాలేదు. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడం, నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు ఎటూ తేలడం లేదు. దీంతో కొన్ని రోజులుగా వరుస భేటీలు జరుగుతున్నా అభ్యర్థి ఖరారు కాలేదు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో ఏకాభిప్రాయం కోసం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పలుమార్లు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు అభ్యర్థి వ్యవహారం హస్తినకు చేరింది.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి



వడదెబ్బపై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల్లో నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నోడల్ అధికారులతో సమావేశమైన ఆయన నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. వయోవృద్ధులు, దివ్యాంగులతో పాటు ఇతర కేటగిరీల వారి విషయంలో హోం ఓటింగ్‌పై దృష్టి సారించాలని తెలిపారు. అంతేకాక స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, సువిధ యాప్ ద్వారా దరఖాస్తులకు అనుమతిపై సూచనలు చేశారు. కాగా, ఓటర్ల సందేహాలు నివృత్తి చేయడంతో పాటు అభ్యర్థులకు సూచనలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌ను కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు.

వడదెబ్బపై అవగాహన

ఎండల తీవ్రతతో వడదెబ్బ బారిన పడే ప్రమాదమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

చెరువుల్లో పూడికతీత పనులు

ప్రస్తుతం చెరువుల్లో నీటిమట్టం తగ్గినందున పూడికతీతపై దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. తద్వారా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాక పూడిక మట్టి రైతులకు ఉపయోగపడుతుందని తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రైతులు మట్టి కోసం ఏఈఓకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని, మట్టి తరలింపులో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడాలని సూచించారు.



కలెక్టరేట్‌లో ఎన్నికల హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

తాగునీటి సరఫరాలో అవాంతరాలను సరిచేస్తూ ఎక్కడా ఇబ్బంది రాకుండా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆమె వీసీ ద్వారా తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో వసతుల కల్పన, వడదెబ్బ జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్యలు తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ యువరాజ్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు ప్రసాదరావు, నర్సింగరావు, విజయనిర్మల, శ్రీనివాస్, సురేందర్, సన్యాసయ్య, వినోద్, హరికిషన్, రాజేశ్వరి, కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, అరుణ, రాంబాబు, సత్యనారాయణ, వి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజలకు మెరుగైన వైద్యం

రఘునాథపాలెం: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. రఘునాథపాలెం మండలం వీవీ.పాలెంలో పల్లె దవాఖానాను తనిఖీ చేసిన ఆయన వైద్యసేవలు, మందుల లభ్యతపై ఆరా తీశాక పలు సూచనలు చేశారు. ఎండ నుంచి కాపాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతితో పాటు డాక్టర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సరదాగా.. మంత్రి తుమ్మల!



లకారం ట్యాంక్‌బండ్‌పై మంత్రి తుమ్మల తదితరులు

సమీక్షలు, సమావేశాలతో నిత్యం బిజీగా గడిపే రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కాస్త సేద తీరారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని వెలుగుమట్ల అటవీపార్క్‌ను నాయకులతో కలిసి పరిశీలించారు. పార్క్‌లో కలియదిరిగిన ఆయన అభివృద్ధికి ఉన్న అవకాశాలపై ఆరా తీశారు. ఆతర్వాత మంత్రి తుమ్మల.. లకారం ట్యాంక్ బండ్‌ను సైతం సందర్శించారు. కాసేపు వాకింగ్ చేసిన మంత్రి.. అక్కడకు వచ్చిన పలువురితో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, నాయకులు మలీదు జగన్, కమర్తపు మురళి, నరేందర్, ఆంజిరెడ్డి, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మంఅర్బన్/ఖమ్మం వన్‌టౌన్

రామయ్యకు తిరువీధి సేవ

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రధాన ఆలయం నుంచి రాజవీధి ద్వారా తాత గుడి సెంటర్ వరకు చేపట్టిన ఈ వేడుకలు భక్తుల కోలాటం, నృత్యాల నడుమ కనుల పండువగా సాగింది. తాతగుడి వద్ద రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తిరువీధి సేవలో స్వామివారి ఉత్సవమూర్తులు

గత పదేళ్లలో హామీల ఆర్భాటాలే..

- అన్ని సంఘాలతో చర్చించి ఐక్య కార్యాచరణ
- టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు అనుబంధ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటాలు చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో ఉద్యోగులకు డీఏ, ఎరియర్స్, జీపీఎఫ్‌కు సంబంధించి సుమారు రూ.5,400కోట్ల బకాయి ఉందన్నారు. వీటిపై గత ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలు చేయలేదని తెలిపారు. అంతేకాక అమలుచేసిన కొన్ని అంశాలనే గొప్పగా చెప్పుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో 317 జీఓకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ వేయించుకున్నామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే, మిగతా సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి, పక్కన నాయకులు

అయితే, కొన్ని సంఘాల మాజీ నాయకులు ప్రస్తుతం ఉద్యోగులకు ఏమి రాలేదని చెబుతుండగా.. గత పదేళ్లలో వారేం చేశారో చెప్పాలని చెప్పాలని సూచించారు. కాగా, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో కలిసి జేఏసీగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. ఈసమావేశంలో టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రితో పాటు వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు సుధారాణి, విజయలక్ష్మి, కృష్ణారావు, పుష్ప, గణేష్, రమణ, కొణిదన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, గంగవరపు బాలకృష్ణ, అబ్దుల్‌హకీం, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

నెలవంక దర్శనం!



పండుగ సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన వారితో ఖమ్మం మహిళా పోలీసుస్టేషన్ రహదారిలో రద్దీ

నేడు ఈద్ ఉల్ ఫితర్

- ఘనంగా రంజాన్ జరుపుకునేందుకు సిద్ధమైన ముస్లింలు
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- కొనుగోళ్లతో రద్దీగా మారిన మార్కెట్లు

సత్తుపల్లి: షవ్వాల్ చాంద్(నెలవంక) బుధవారం రాత్రి కనిపించడంతో ముస్లింలు రంజాన్(ఈద్ ఉల్ ఫితర్) పర్వదినాన్ని గురువారం జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. దీంతో నెలవంకను చూడగానే ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు పండుగ సామగ్రి, నూతన వస్త్రాల కొనుగోళ్లకు వచ్చిన వారితో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రహదారులు రద్దీగా మారాయి.



సత్తుపల్లిలో ఈద్గాలో వేసిన టెంట్లు

ముప్పై రోజుల కఠిన ఉపవాస దీక్ష

రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ముప్పై రోజుల కఠిన ఉపవాస దీక్ష ఆచరించారు. రోజంతా దైవధ్యానంలో గడిపిన వారి ఉపవాస దీక్షలు బుధవారం ముగిశాయి. ఇక రాత్రి నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈమేరకు తెల్లవారుజామున 'ఫజర్' నమాజ్ ఆచరించి ఈదుల్ ఫితర్ నమాజ్ చదవాల్సి ఉంటుంది. ఆతర్వాత దర్గాలో ప్రత్యేక ప్రార్థనలకు వెళ్తారు. తప్పకుండా సేమియా(ఏదైనా తీపి పదార్థం) తిని వజూ చేసుకుని ఈద్గాలకు వెళ్లి నమాజ్ ఆచరిస్తారు. అక్కడ ప్రార్థనల అనంతరం పరస్పరం ఈద్ ముబారక్.. అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. అనంతరం ఇళ్లలో స్నేహితులకు విందు ఏర్పాటుచేస్తారు. ఈమేరకు జిల్లాలోని ఈద్గాలకు పెద్ద సంఖ్యలో వచ్చే ముస్లింల కోసం ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రంగా ఉన్న నేపథ్యాన టెంట్లు వేయడంతో పాటు తాగునీరు సమకూరుస్తున్నారు.

గొల్లగూడెం ఈద్గాలో సీపీ పరిశీలన

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 14వ డివిజన్ గొల్లగూడెం ఈద్గాలో రంజాన్ ప్రార్థనలకు జరుగుతున్నట్లు ఏర్పాట్లను బుధవారం సీపీ సునీల్‌దత్ పరిశీలించారు. వేలాదిమంది ముస్లింలు ప్రార్థనకు రానున్న నేపథ్యాన పార్కింగ్, తదితర ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు చేశారు. అడిషినల్ డీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ఎస్‌ఐలతో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఈద్గాలో పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

విధిగా ఫిత్రాదానం

ఫిత్రా పేరుతో ఈ పండుగను 'ఈదు ఉల్ ఫితర్'గా పిలుస్తారు. ఆర్థికంగా ఉన్న ప్రతిఒక్కరు ఫిత్రా (దానం) తప్పని సరిగా చెల్లించి నమాజ్ చదవాల్సి ఉంటుంది. పండుగ రోజు పుట్టిన బిడ్డకు సైతం ఫిత్రా దానం ఇవ్వాలని నమ్ముతారు. బహిరంగ మార్కెట్‌లో రెండున్నర కిలోల గోధుమల ధరకు సమానంగా ఫిత్రా చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కొక్కరు రూ.80 చొప్పున ఫిత్రా చెల్లించాలని ముస్లిం మతపెద్దలు నిర్ణయించారు. అయితే అంతకంటే ఎక్కువ కూడా ఇవ్వొచ్చు. తద్వారా నిరుపేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకునేందుకు అవకాశముంటుంది.

మంత్రుల రంజాన్ శుభాకాంక్షలు

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: రంజాన్ పర్వదినం సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ పునుకొల్లు నీరజ సైతం ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

16న న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు

ఖమ్మం లీగల్: న్యాయవాదులు సహకార సంఘంలో నలుగురు డైరెక్టర్ల ఎన్నికకు ఈనెల 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈనెల 16న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి గుద్దేటి రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కొప్పుల రవికుమార్ తెలిపారు. కాగా, నామినేషన్ ఉపసంహరణ అనంతరం పోటీలో మిగిలిన చుంచుల మల్లికార్జునరావు, అనుముల నర్సింహారావు, భూక్యా రమేష్, గోరింట్ల శాంతారావు, పలివెల్ల లక్ష్మి, దేవ శ్రీనివాసరావుకు గుర్తులు కేటాయించినట్లు వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

ఖమ్మంవ్యవసాయం: రంజాన్ పండుగతో పాటు వారాంతం నేపథ్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. రంజాన్ సందర్భంగా గురు, శుక్రవారాలు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక శని, ఆదివారాలు వారాంతపు సెలవులుగా ఉంటాయని పేర్కొన్నారు. తిరిగి 15వ తేదీ సోమవారం నుంచి యథాతదంగా మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలవుతాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సెలవు రోజుల్లో పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకురావొద్దని కార్యదర్శి కోరారు.

పండితాపురం ఘటనలో 28 మందిపై కేసు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో పాతకక్షల నేపథ్యాన మంగళవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, ఓ కారు కూడా ధ్వంసమైంది. ఈ మేరకు ఇరువర్గా ఫిర్యాదుతో బుధవారం 28 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే, పండితాపురంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

జాతరకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

కామేపల్లి: జాతర వెళ్లి వస్తున్న యువకుల బైక్, ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాస్తిపల్లికి చెందిన దేవండ్ల గేష్మంత్ తన స్నేహితుడితో కలిసి బుధవారం కొత్తలింగాలలోని శ్రీ కోటమైసమ్మతల్లి జాతరకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో ఏన్కూరు మండలం మర్సకుంటకు చెందిన వ్యక్తి జాస్తిపల్లి నుంచి కొత్తలింగాలకు బైక్‌పై వెళ్తుండగా గేష్మంత్ ఢీకొట్టాడు. ఈఘటనలో గేష్మంత్ కంటికి తీవ్ర గాయం కాగా, స్థానికులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఫైనాన్స్ వేధింపుల కేసులో ఐదుగురి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ద్విచక్ర వాహనంపై తీసుకున్న రుణం చెల్లించాలని వెంట పడి తరుముతుండగా, యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటనకు బాధ్యులైన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూపీకి చెందిన మార్బుల్ వర్కర్ వినయ్ ద్విచక్ర వాహనంపై తీసుకున్న ఫైనాన్స్ రూ.4వేల బకాయి ఉండగా నాలుగు రోజుల క్రితం ఆయనను మోహన్‌సాయి ఆటో ఫైనాన్స్ సంస్థ రికవరీ ఏజెంట్లు వేధించారు. ఈక్రమంలో కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న ఏజెంట్ల నుంచి తప్పించుకునేందుకు వినయ్ పరుగెత్తుతూ చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటనలో ఇప్పటికే రికవరీ ఏజెంట్లు రాంచందర్, అజయ్‌కుమార్, ఇంటి యజమాని ఎస్. రవి, మేస్త్రీ శ్రీనును అరెస్ట్ చేయగా.. ఫైనాన్స్ సంస్థ యజమాని సైదారావును బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిర(చింతకాని): చింతకాని మండలం నాగులవంచలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై నాగుల్‌మీరా, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10 వేలు నగదు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సుబాబుల్, జామాయిల్ తోటల్లో మంటలు

మధిర: మండలంలోని అంబారుపేట ముత్యాలమ్మ రోడ్డులో బుధివారం రాత్రి అగ్నిప్రమా దం జరిగింది. అక్కడి ఎనిమిదెకరాల సుబా బుల్ తోటతో పాటు రెండెకరాల్లో జామాయిల్ తోటకు నిప్పంటుకుంది. సమీపంలో చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టగా, గాలి కారణంగా తోటలకు వ్యాపించినట్లు తెలుస్తోంది. అయి తే, మంటలు ఎగిసిపడుతుండడంతో సమీప తోటల రైతులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకున్నారు. కాగా, అర్ధరాత్రి వరకు మంటలు అదుపులోకి రాకపోగా.. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఫైర్ ఇంజన్లకు పిలిపించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,174



సేమియా కొనుగోలు చేస్తున్న దృశ్యం



అత్తరు పరిమళాన్ని ఆస్వాదిస్తూ..



కిటకిటలాడుతున్న కమాన్ బజార్



చెప్పుల దుకాణం వద్ద..



దుస్తులను పరిశీలిస్తూ..



టోపీలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

రంజాన్ సందడి..

నెలపాటు ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు గురువారం రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. జిల్లాలో బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో మత పెద్దలు ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు పెద్దసంఖ్యలో ముస్లింలు రావడంతో జిల్లా కేంద్రంలోని కమాన్‌బజార్, కస్బాబజార్‌లోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. సేమియాతో పాటు దుస్తులు, చెప్పులు, సుగంధ ద్రవ్యాలు కొనుగోలు చేయడం కనిపించింది. అయితే, పలువురు వ్యాపారులు ఆఫర్లు ప్రకటించడంతో ముస్లింలే కాక ఇతరులు కూడా కొనుగోళ్లకు రావడం విశేషం. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం



వైరా : మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు, నాయకులు

బీజేపీ ఖమ్మం అభ్యర్థి వినోద్‌రావు

వైరా/ఏన్కూరు: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ దేశవ్యాప్తంగా బీజేపీ అత్యధిక సీట్లు సాధించడం, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. వైరా, ఏన్కూరు మండలాల్లో బుధవారం ఆయన నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ ఖమ్మం అభ్యర్థిగా తనను గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. కేంద్రం అమలుచేసే పథకాలకు పేర్లు మార్చి లబ్ధి పొందుతన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. అలాగే, ఏన్కూరులో పార్టీ మండల కార్యాలయాన్ని వినోద్‌రావు ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు శ్యాం రాథోడ్, ఎస్.కోటేశ్వరరావు, బి.నరేష్, ఏలే భద్రయ్య, మనుబోలు వెంకటకృష్ణ, పాపగంటి నరేష్, ఓర్సు శ్రీను, ముత్తయ్య, సంజయ్, కొవ్వూరి నాగేశ్వరావు, నల్లమోతుల రమేష్ పాల్గొన్నారు.

కొణిజర్లలో అడ్డుకున్న అధికారులు

కొణిజర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కొణిజర్ల మండలానికి వచ్చిన బీజేపీ అభ్యర్థి వినోద్ రావు, నాయకులు ఉపాధి హామీ కూలీలను కలిసేందుకు వెళ్తుండగా అధికారులు అడ్డుకున్నారు. కొణిజర్ల చెరువులో ఉపాధి హామీ పని జరుగుతుండగా వారికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించేందుకు నాయకులు బయలుదేరారు. వీరి కాన్వాయ్‌ను తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీడీఓ ఏ.రోజారాణి అడ్డుకుని.. అనుమతి లేకుండా ఉపాధి పని ప్రదేశానికి వెళ్లడానికి వీలు లేదని చెప్పారు. అనుమతి పత్రాలు చూపించినా అధికారులు పంపలేదు. ఈ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ విద్యాసాగర్ తెలిపారు.

ఫైనాన్స్ రికవరీ ఏజెంట్‌పై కేసు

ఖమ్మంక్రైం: ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్‌పై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు... ఖమ్మం సుగ్గలవారి తోటకు చెందిన గుండ సాయిసందీప్ ద్విచక్రవాహనాలు ఫైనాన్స్ చేసే బజాజ్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఖమ్మంకు చెందిన ముగ్గురు ఈఎంఐ కట్టక పోవడంతో వారి నుంచి వాహనాలు రికవరీ చేసిన సందీప్ వాహనాలను కంపెనీకి అప్పజెప్పకుండా అమ్మేసుకున్నాడు. కంపెనీకి మాత్రం వాహనదారుల ఆచూకీ తెలియడం లేదని చెబుతున్నాడు. దీంతో అనుమానం వచ్చిన కంపెనీ అధికారులు విచారించగా విషయం బయటపడింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన కోటమైసమ్మ జాతర

కామేపల్లి: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని కొత్తలింగాలలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు అర్చకులు పూజారి పుల్లయ్యశర్మ, ఫణిశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయశాఖ అధికారులు ఆర్.సమత, నల్లమోతు శేషయ్య సమక్షాన లెక్కించారు. ఈమేరకు కానుకల ద్వారా రూ.50,382, పూజ టికెట్ల అమ్మకంతో రూ.12 వేల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గింజల నర్సింహారెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, తోటకూరి శ్రీనివాస రావు, శంకరయ్య, కిరణ్‌బాబు, వీరయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

బ్యాంక్ మేనేజర్ మోసం రూ.5కోట్లకు పైగానే..

సీసీఎస్‌లోనూ కేసు నమోదు, విచారణ

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు మేనేజర్ అక్రమంగా ఖాతాదారుల నగదును దారి మళ్లించిన ఘటనపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదుకాగా.. సీసీఎస్ పోలీసులు సైతం మేనేజర్ రామకృష్ణపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుల ఆధారంగా సదరు మేనేజర్ రూ.2.40కోట్ల మేర ఖాతాదారుల నగదు వాడుకున్నట్లు తెలుస్తుండగా.. అందరూ బయటకు వస్తే 5కోట్లకు పైగా మోసం బయటపడే అవకాశముందని సమాచారం. విదేశాల్లో చదువుకుంటున్న పిల్ల కోసం పలువురు సదరు బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. అయితే, నిబంధనల మేరకు ముందస్తు చెక్కులు ఇచ్చిన వారు విదేశాల్లోని యూనివర్సిటీలు సూచించినప్పుడు మాత్రమే ఖాతాల నంచి నగదు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు బ్యాంకు మేనేజర్ ఆ చెక్కుల ఆధారంగా రూ.2.40కోట్ల మేర నగదును తనతో పాటు కుటుంబీకులు, బంధువుల ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటివరకు 20మందికి పైగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో పలువురు బుధవారం సైతం పోలీస్ స్టేషన్‌కు రాగా.. పోలీసు శాఖలోని ఓ హెడ్ కానిస్టేబుల్ సైతం రూ.15లక్షల నగదు కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, పోలీసులు విచారణలో భాగంగా బ్యాంక్ మేనేజర్ రామకృష్ణతోపాటు ఆయన భార్య, తల్లిదండ్రులు, సోదరులపై సైతం కేసు నమోదు చేసి వారి బ్యాంక్ ఖాతాలను పరిశీలిస్తున్నారు. ఇక సదరు బ్యాంక్ ఉన్నతాధికారులు సైతం ఖమ్మం చేరుకుని ఉద్యోగులను ఆరా తీసినట్లు తెలిసింది.

మాయమై పోతున్నడమ్మ మనిషన్న వాడు..

మాయమైపోతున్నడమ్మ మనిషన్న వాడు.. అంటూ ఓ కవి చెప్పిన మాటలు అక్షరసత్యాలు అవుతున్నాయి. మానవ సంబంధాల మాటేమో కానీ కుటుంబ బంధాలకే విలువ ఇవ్వని వ్యక్తులు చాలాచోట్ల కనిపిస్తున్నారు. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఒకేరోజు జరిగిన మూడు హత్యలు దీన్ని నిజం చేస్తున్నాయి. రెండు ఘటనల్లో భార్యలను భర్తలు హత్య చేయగా.. మరో ఘటనలో భార్యే భర్తను హతమార్చడం గమనార్హం. అయితే, ఇందులో ఓ ఘటనకు మద్యం మత్తు, ఇంకో ఘటనలో అనుమానం కారణం కాగా.. గంజాయి కేసులో కొడుకు జైలుకు వెళ్లడం మరో హత్యకు కారణమైంది. వీటిని పక్కన పెడితే కామేపల్లి మండలం గోవింద్రాలలో కుటుంబ యజమానిని కోల్పోయిన ఆయన భార్య, కుమారుడు ఆ ఆవేదనను భరించలేక ఆత్మహత్యకు పాల్పడడం విషాదాన్ని నింపింది. మూడు హత్యలు విలువలు పతనమవుతున్నాయని చెబుతుండగా.. గోవింద్రాల ఘటన మాత్రం కటుంబ బంధాన్ని చాటడం గమనార్హం.

- జిల్లాలో ఒకేరోజు మూడు హత్యలు
- రెండు ఘటనల్లో భార్యలను హత్య చేసిన భర్తలు..
- ఇంకో ఘటనలో భర్తను చంపిన భార్య?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యే హత్య చేసి ఉంటుందని అనుమానాలు

ఖమ్మంక్రైం: గంజాయి కేసులో జైలుకు వెళ్లిన కుమారుడికి బెయిల్ ఇప్పించే విషయంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ పెద్దదై భర్త ప్రాణాలను బలితీసుకుంది. అయితే, భార్యే క్షణాకావేశంలో భర్తను హత్య చేసి ఉంటుందనే అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం... ఖమ్మం చెరువుకట్ట బజార్ కూరగాయల మార్కెట్ వెనుక గేట్ ఎదురుగా నివసిస్తున్న వడ్లాణపు రాములు(56) ఓ వైన్స్‌లో పనిచేస్తున్నాడు.. ఆయనకు భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఓ కుమారుడికి వివాహం కావడంతో ఆయన సమీపంలోనే మరో ఇంట్లో నివసిస్తున్నాడు. ఇక మరో కుమారుడు గంజాయి సరఫరా కేసులో జైలుకు వెళ్లగా ఆయనకు బెయిల్ ఇవ్వడానికి ఎవరూ కూడా ముందుకు రాకపోవటంతో రాములు – సత్యవతి తరచుగా గొడవ జరుగుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం కూడా మద్యం తాగొచ్చిన రాములుకు సత్యవతితో అర్ధరాత్రి వరకు గొడవ జరిగింది. అనంతరం రాములు రక్తపు మడుగులో కొట్టుకుంటుండగా సమీపంలో ఉండే కుమారుడికి సమాచారం ఇచ్చిన సత్యవతి ఆస్పకి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అయితే, గొడవ పడుతున్న క్రమంలో కత్తిపీటతో రాములే మద్యం మత్తులో తన ముఖంపై కొట్టుకున్నాడని సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ సత్యవతే క్షణికావేశంలో కత్తిపీటతో రాములుపై దాడి చేసిందని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.



రాములు (ఫైల్)

భార్యను హతమార్చిన వ్యక్తి

తిరుమలాయపాలెం: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి మళ్లీ మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలంటూ తన భార్యకు ఉరి వేసి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సుబ్లేడుకు చెందిన పోలెపొంగు ఇస్తారి, ఆయన భార్య సరోజన (63) కుమారుడు సుమన్‌తో కలిసి జీవిస్తున్నారు. ఉగాది పండుగకు మంగళవారం సుమన్ తన భార్యతో కలిసి అత్తగారింటికి వెళ్లగా ఇస్తారి దంపతులే ఉన్నారు. అయితే, మద్యం మత్తులో ఉన్న ఇస్తారి భార్య వద్ద ఉన్న డబ్బు మద్యానికి ఇవ్వాలంటూ గొడవ పడ్డాడు. ఈక్రమంలోనే మంచంలో పడుకున్న సరోజన మెడకు తాడు బిగించి లాగడంతో ఆమె స్పృహ తప్పింది. అయితే, ఆమె కింద పడడంతో స్పృహ తప్పిందని ఇస్తారి చెప్పడంతో చుట్టుపక్కల వారు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, ఇంట్లో లభించిన తాడు, మెడపై ఉన్న గాయంతో భర్తే హత్య చేసినట్లు గుర్తించి, వారి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



పోలెపొంగు సరోజన (ఫైల్)

అనుమానంతో హత్య చేసిన భర్త

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెంకు చెందిన ఓ వ్యక్తి తన భార్యపై అనుమానం పెంచుకుని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొల్లికొండ మల్లమ్మ – లింగయ్య దంపతులు కూలీచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా లింగయ్యకు భార్యపై అనుమానం ఏర్పడగా.. ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం కూడా గొడవ జరగగా.. మల్లమ్మను లింగయ్య కత్తితో విచక్షరహితంగా పొడవగా ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, నిందితుడు పరారీలో ఉండగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆ కుటుంబంలో వరుస మరణాలు

- మూడు నెలల క్రితం కుటుంబ పెద్ద ఆత్మహత్య
- ఇప్పుడు భార్య, కుమారుడి బలవన్మరణం
- ఒంటరిగా మిగిలిన బాలిక

కామేపల్లి: అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని వెంటాడాయి. బాధ తట్టుకోలేక కుటుంబ పెద్ద మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోగా.. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్న ఆయన భార్య, కుమారుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఎనిమిదేళ్ల బాలిక మాత్రం హాస్టల్ ఉండి చదువుకుంటుండడంతో ప్రాణాలతో మిగిలినా ఎవరూ లేని అనాథగా మారింది. కామేపల్లి మండలం గోవింద్రాలలో చోటు చేసుకున్న ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి.



సక్రాం - నేవుత్రా (ఫైల్)



రాంచరణ్ (ఫైల్)

జనవరిలో తొలి మరణం

గోవింద్రాలకు చెందిన లావుడ్యా సక్రాం – నేవుత్రా దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిలో కుమార్తె కారేపల్లిలోని గురుకులంలో ఎనిమిదో తరగతి, కుమారుడు రాంచరణ్(11) ఖమ్మంలో ఆరో తరగతి చదువుతున్నారు. అయితే, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో సక్రాం గత జనవరిలో పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి భార్యాపిల్లలు మనస్తాపానికి గురయ్యారు. కాగా, కుమార్తె హాస్టల్‌లోనే ఉండగా.. కుమారుడు రాంచరణ్ ఇంటికి వచ్చాడు. ఈ సమయాన తండ్రి మరణాన్ని గుర్తుచేసుకుంటూ రాంచరణ్, ఆయన తల్లి ఆవేదన చెందారు. ఈమేరకు 3వ తేదీన ఇద్దరూ కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగగా.. కాసేపటికి గుర్తించిన బంధువుల, స్థానికులు తొలుత ఖమ్మంకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలోనే నేవుత్రా మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గోవింద్రాలకు తీసుకొచ్చిన బంధువులు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సమయాన రాంచరణ్ హైదరాబాద్ ఆస్పత్రిలోనే ఉండగా ఆయన బుధవారం మృతి చెందినట్లు సమాచారం అందింది. దీంతో కుటుంబంలో విషాదం నెలకొనగా ఆయన మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులు, సోదరుడు మృతి చెందడంతో కుటుంబాలో బాలిక మాత్రమే మిగిలినట్లయింది. అయితే, ఆమె కూడా 3వ తేదీన ఇంటికి వచ్చినట్లయితే పురుగుల మందు తాగేదని తెలుస్తోంది. ప్రస్తుతం విషాదంలో ఉన్న ఆమెను బంధువులు చేరదీశారు.